# 91. సమయం

ఓ స్వామి ఆధ్యాత్మిక ప్రసంగంలో ఇలా చెప్పాడు.

"మనకి ఈ రోజుల్లో ఇతరులకి సహాయం చేయడానికి సమయం చిక్కదు. కనీసం కష్టంలో వున్నవారికి వారి కష్టాలు తీరి మంచి జరగాలన్న బలమైన భావన మనం కలిగి వున్నా చాలు. అది వాళ్ళ బాధలు తీరడానికి సహాయం చేస్తుంది."

ప్రసంగానంతరం స్వామితో సహా అంతా భోజనానికి కూర్చున్నారు. ఆయన ప్రసంగం విన్న వంటవాడు స్వామి విస్తరిలో చిన్న చిన్న కాగితాలని వడ్డించాడు. వాటి మీద 'చక్కగా వుడికిన అన్నం, కమ్మటి కూర, జీడిపప్పు పాయసం, చిక్కటి పెరుగు' అని వివిధ ఆహార పదార్థాల పేర్లు రాసి వున్నాయి.

"ఇవేమిటి? నన్ను అవమానిస్తున్నావా?" కోపంగా అడిగాడు స్వామి.

"లేదు స్వామి. నాకు చెయ్యి నొప్పిగా వుంది కాబట్టి మీ అందరి కడుపులు నిండాలన్న బలమైన భావనతో ఆ కాగితాల మీద నేను వండాలనుకున్న వాటి పేర్లు రాసి వడ్డించాను. ఇతరులకి సహాయం చేయడానికి మనకి సమయం లేనప్పుడు భావన వాళ్ళ కష్టాలని తీరుస్తుందని ఇందాక మీ ప్రసంగంలో చెప్పారు. ఆ ప్రకారం మీ కడుపులు నిండుతాయి కదా." జవాబు చెప్పాడు వంటవాడు.

మనం మన కాలాన్ని ఇతరులకి సహాయం చేయడానికి వెచ్చిస్తే తప్ప మనకి చిత్తశుద్ధి కలిగి, ఆధ్యాత్మిక ప్రగతి వుండదు.

# 92. చీకటి - వెలుగు

చాలా కొండ గుహల్లా ఆ గుహలో కూడా కటిక చీకటి. దాని జీవితకాలంలో అది చీకటిని తప్ప మరేదీ ఎరగదు.

ఓ రోజు దానికో కంఠం వినిపించింది.

"బయటకి వచ్చి వెలుగుని చూడు. సూర్యరశ్మి ఎలా వుంటుందో చూడు."

"వెలుగా? సూర్యరశ్మా? నాకు అవి ఎలా వుంటాయో కూడా తెలీదు. నిజానికి నాకు చీకటి తప్ప ఇంకేం తెలీదు." బదులు చెప్పింది చీకటి గుహ.

"ముందు నువ్వు బయటకి వచ్చి చూడు."

గుహ బయటకి వచ్చి చూస్తే అంతటా వెలుగే. తలెత్తి సూర్యుడి వంక చూస్తూ చెప్పింది గుహ.

"నా గుహలోకి వచ్చి చీకటిని చూడు."

"చీకటంటే?" అడిగాడు సూర్యుడు.

"వచ్చి చూడు. నీకే తెలుస్తుంది."

సూర్యుడు గుహలోకి వచ్చి చూసాడు.

"ఏదీ? నీ చీకటిని చూపించు." అడిగాడు సూర్యుడు.

కాని గుహలో వెలుతురు తప్ప చీకటి ఎక్కడా లేదు!

ఇలాగే జ్ఞానమనే వెలుగు మనిషిలోకి ప్రవేశించాక అధర్మమనే అజ్ఞానం సంపూర్ణంగా, శాశ్వతంగా తొలగిపోతుంది.

## 93. ఆఖరి కోరిక

ఓ బ్రహ్మజ్ఞాని గురించి విన్న కొందరు పొరుగూరు నించి ఆయన్ని దర్శించుకోడానికి వచ్చారు. సాధారణంగా అలాంటివారు అతి తక్కువ అవసరాలతో జీవిస్తూంటారు. కాని అతని చుట్టూ వున్న అనేక విలాస వస్తువులని చూసి వాళ్ళకి ఆశ్చర్యం కలిగింది.

తమ ఊరికి వెళ్ళాక వాళ్ళు ఇరుగు పొరుగుకి చెప్పారు.

"ఆయన దైవాన్వేషణ నించి వైదొలగాడు. ఓ మహారాజుకి కూడా లభ్యంకాని వస్తువులు ఇచ్చే భోగాలని అనుభవిస్తున్నాడు."